సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.15 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.19
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.19, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 2,250 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం 34.6°/20.8°
జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నూతన జేసీగా మంత్రి మౌర్య భరద్వాజ్

- ఏపీ మారిటైం బోర్డు సీఈఓగా అభిషేక్‌కుమార్ బదిలీ



నూతన జేసీ మంత్రి మౌర్య భరద్వాజ్

ప్రశాంతి నిలయం: జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా మంత్రి మౌర్య భరద్వాజ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ జేసీగా ఉన్న అభిషేక్ కుమార్‌ను ఏపీ మారిటైం బోర్డు సీఈఓగా బదిలీ చేస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్వర్వులు జారీ చేశారు. 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మంత్రి మౌర్య భరద్వాజ్ ప్రస్తుతం కర్నూలు జిల్లా ఆదోని సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇక 2023 డిసెంబర్ 21న జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. 22 నెలల పాటు జేసీగా ఆయన జిల్లా వాసులకు సేవలందించారు.

నదిలో చిక్కుకున్న ట్రాక్టర్



ట్రాక్టరును తాళ్ల సాయంతో బయటకు లాగుతున్న గ్రామస్తులు

కొత్తచెరువు: మండలంలోని ఇరగంపల్లి సమీపంలో వంగపేరు నది ఉధృతిలో ట్రాక్టర్ చిక్కుకుంది. పోలీసులు స్పందించి గ్రామస్తుల సహాయంతో ట్రాక్టరును, అందులోని రైతును సురక్షితంగా బయటకు తీశారు. వివరాలిలా ఉన్నాయి. కొత్తచెరువు మండలం ఇరగంపల్లికి చెందిన రైతు వెంకటేష్ వంగపేరు నది పాత వంతెనపై మొక్కజొన్నలు ఆరబోశాడు. గురువారం ఎగువన కురిసిన వర్షాలకు నదికి వరద మొదలైంది. దీంతో రైతు హుటాహుటిన పంటను ట్రాక్టరులోకి చేర్చి.. నదిలో నుంచి బయటకు వస్తుండగా వరద ఉధృతి ఎక్కువై ట్రాక్టర్ తిరగబడింది. నది మధ్యలోనే చిక్కుకుపోయింది. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే గ్రామస్తులు చొరవ తీసుకుని రైతు వెంకటేష్‌ను కాపాడడంతో పాటు ట్రాక్టరును కూడా తాళ్ల సాయంతో బయటకు లాగారు. ఘటనలో రైతు పంట మొత్తం నష్టపోయాడు.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలు బంద్

ధర్మవరం అర్బన్: నేటి నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రులకు కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయల బిల్లులు బకాయి పడిందన్నారు. దీంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. ఈ నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో శుక్రవారం నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వీఆర్‌కు మడకశిర సీఐ

మడకశిర: స్థానిక అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నగేష్‌బాబును వీఆర్‌కు పంపుతూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో నూతన సీఐగా జీవీ సుబ్రహ్మణ్యంను నియమించారు. నూతన సీఐ నేడో, రేపో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

కొత్త టీచర్ల ప్లేస్‌మెంట్స్‌కు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీ–25కు ఎంపికైన కొత్త టీచర్లకు ప్లేస్‌మెంట్ (స్థానం) కోసం గురువారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఎస్జీటీలకు మ్యానువల్ కౌన్సెలింగ్, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారంలోపు పూర్తికావాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో శిక్షణ కేంద్రాల్లోనే ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. రాత్రి 9 గంటలకు ఎస్జీటీలకు కౌన్సెలింగ్ ప్రారంభమై అర్ధరాత్రి దాకా కొనసాగింది. మొత్తం 167 మంది ఎస్జీటీలుండగా, 148 మంది తెలుగు, 14 మంది ఉర్దూ, ఐదుగురు కన్నడ ఉన్నారు. సీనియార్టీ ప్రకారం ఒక్కో అభ్యర్థికి ఖాళీలు డిస్‌ప్లే చేశారు. వారికి నచ్చిన స్థానాన్ని కోరుకున్నారు. ఇక 581 స్కూల్ అసిస్టెంట్ టీచర్లు తొలిసారి వెబ్ కౌన్సెలింగ్ కావడంతో ఆప్షన్ల నమోదులో కాస్తా గందరగోళానికి గురయ్యారు. అధికారులు వారి అనుమానాలను నివృత్తి చేశారు. శుక్రవారం మధ్యాహ్నానికి వారి కౌన్సెలింగ్ పూర్తికానుంది.

పచ్చ మంద.. బియ్యం దందా

- యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- దర్జాగా సరిహద్దు దాటిస్తున్న టీడీపీ నాయకులు
- అక్రమార్కులపై 6–ఏ సెక్షన్ కేసులతో సరిపెడుతున్న అధికారులు
- పీడీయాక్టు నమోదు చేయకుండా మీనమేషాలు
- పేదల బియ్యంతో రూ.కోట్లు గడిస్తున్న వైనం

ధర్మవరానికి చెందిన టీడీపీ నాయకుడు మధుబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఏడాదిగా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నాడు. పట్టణంలోని చెన్నూరు రోడ్‌లో రేషన్ బియ్యం బస్తాలు వాహనంలో ఎక్కిస్తుండగా ఓసారి పోలీసులకు పట్టుబడ్డాడు. వాహనాన్ని సీజ్ చేసిన అధికారులు అతనితో పాటు వాహన డ్రైవర్‌పై కూడా కేసు నమోదు చేశారు. 5 టన్నుల బియ్యం కూడా స్వాధీనం చేసుకున్నారు. అయినా అతనిలో మార్పు రాలేదు. మళ్లీ అదే రేషన్ దందా కొనసాగిస్తున్నాడు.

మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గ పరిధిలోని సోమందేపల్లికి చెందిన ఓ వ్యాపారి రేషన్ బియ్యం మాఫియా డాన్‌గా అవతారమెత్తాడు. తొలుత పెనుకొండ నియోజకవర్గంతో మొదలు పెట్టి... మెల్లమెల్లగా రాయలసీమలోని మూడు జిల్లాలను శాసించే స్థాయికి ఎదిగాడు. ప్రతినెలా ఇతని అక్రమ సంపాదన రూ.కోటికిపైగానే ఉండటం ప్రజల్ని విస్మయానికి గురి చేస్తోంది.

... ఇలాంటి వారు జిల్లాలో ఒకరు, ఇద్దరు కాదు. ప్రతి నియోజకవర్గంలో ఉన్నారు. వీరంతా అధికార తెలుగుదేశం పార్టీ వారే కావడంతో అధికారులు సైతం వారిని ఏమీ చేయలేని పరిస్థితి. దీంతో రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా సాగుతోంది.



బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు రామగిరి రైతు సేవా కేంద్రంలో నిల్వ ఉంచిన రేషన్‌బియ్యం

కదిరి: చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది. వైఎస్ జగన్ హయాంలో రేషన్ బియ్యం మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందించేవారు. దీంతో అప్పట్లో ఎలాంటి అక్రమాలు జరగలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటింటికీ రేషన్ పంపిణీకి స్వస్తి చెప్పింది. ఇది టీడీపీ నాయకులకు వరంగా మారింది. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో కొందరు టీడీపీ నాయకులు రేషన్ బియ్యం వ్యాపారంలోకి దిగి రూ.కోట్లు గడిస్తున్నారు. చౌకడిపో డీలర్లు కూడా సొంత పార్టీ వారే కావడంతో వారి వ్యాపారం సులువుగా సాగుతోంది.

రేషన్ దందా సాగుతోందిలా...

రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ డీలర్ల నుంచి కిలో రూ.12 నుంచి రూ.15 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. కొందరైతే ఏకంగా గోదాముల వద్దే అక్కడి అధికారులకు నెలవారీ మామూళ్లు ఇస్తూ రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన రేషన్ బియ్యాన్ని ఎంపిక చేసుకున్న రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి పలు రకాల కంపెనీల పేరుతో ఉన్న సంచుల్లో నింపి రాత్రికి రాత్రి సరిహద్దులు దాటిస్తున్నారు. ఇలా జిల్లా నుంచి ప్రతి నెలా సుమారు 3,500 మెట్రిక్ టన్నుల బియ్యం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా అవుతున్నట్లు కూటమి నేత ఒకరు తెలిపారు. మహారాష్ట్రలో ఈ బియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో అక్కడికి కూడా లారీల ద్వారా పంపుతున్నారని ఆయన పేర్కొన్నారు. అక్కడ కిలో రూ.35 చొప్పున విక్రయిస్తారని వెల్లడించారు. ఒక్కోలారీ బియ్యంపై ఎంతలేదన్నా రూ.3 లక్షలపైనే లాభం వస్తోందని తెలిపారు.

1,367 రేషన్ దుకాణాల సంఖ్య	**5,62,784** జిల్లాలోని రేషన్ కార్డులు
8,700 కార్డుదారులకు ప్రతి నెలా సరఫరా చేసే బియ్యం (మెట్రిక్ టన్నులు)	**3,500** అక్రమంగా తరలిపోతున్న బియ్యం (మెట్రిక్ టన్నులు)

ప్రతి మండలంలోనూ ఏజెంట్లు..

రేషన్ బియ్యం దందా చేస్తున్న వారు బియ్యం సేకరణకు ప్రతి మండలంలో కొందరు ఏజెంట్లను నియమించుకున్నట్లు తెలుస్తోంది. వారి ద్వారానే బియ్యం సేకరిస్తున్నారు. అధికార పార్టీ అండ ఉండటంతో దందా యథేచ్ఛగా సాగిపోతోంది. వారి కన్నా ఎక్కువే ఇస్తామని ఎవరైనా వెళ్లినా చౌకడిపో డీలర్లు బియ్యం ఇచ్చేందుకు జంకుతున్నారు. తమపై ఎక్కడ దాడులు చేయిస్తారోనన్న భయంతో బియ్యాన్ని అక్రమార్కులకే అప్పగిస్తున్నారు. చాలామంది రేషన్ కార్డు లబ్ధిదారులు బియ్యానికి బదులుగా డీలర్ ఇచ్చిన మొత్తం తీసుకుని బయోమెట్రిక్ వేసి వెళ్తున్నారు. ఆ బియ్యాన్ని డీలర్ అక్రమార్కులకు అప్పగిస్తున్నారు.

పీడీ యాక్టు నమోదు ఏదీ?

రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసే వారిపై అధికారులు తూతూ మంత్రంగా 6–ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఒక్కోసారి తహసీల్దార్ ఎదుట హాజరు పరచి అక్కడి నుంచే అటే ఇంటికి పంపుతున్నారు. అందుకే వారంతా మళ్లీ అక్రమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. వాస్తవానికి రెండుసార్లకు మించి పట్టుబడితే కచ్చితంగా పీడీ (ప్రివెంటివ్ డిటెన్షన్)యాక్టు నమోదు చేయాలి. అలా చేస్తే ఏడాది వరకూ బెయిల్ కూడా రాదు. కోర్టులో కేసు నిరూపితమైతే ఐదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే ఎక్కడా వీరిపై పీడీ యాక్టు నమోదు చేయలేదు. కొన్నిసార్లు వీరు కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తూ అవి రేషన్ బియ్యం కాదంటూ తప్పించుకుంటున్నారు.

అధికారులపైనా చర్యలు తీసుకోవాలి



రేషన్ బియ్యాన్ని పందికొక్కుల్లా మెక్కడం పాపం. దీని వెనుక ఎంతటి వారున్నా.. కఠిన చర్యలు తీసుకోవాలి. వీరికి సహకరిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై పీడీ యాక్టు ప్రయోగించాలి.
– మీసాల వేమయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి, సీపీఐ

అంతా అధికార పార్టీ వారే



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు దోచుకోవడం.. దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమార్కులంతా అధికార పార్టీ వారే కావడంతో ఇటు పోలీసులు గానీ, అటు రెవెన్యూ అధికారులు గానీ ఏమీ చేయలేకపోతున్నారు. ఎవరైనా వారి జోలికెళ్తే వెంటనే ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్లు, బెదిరింపులు వస్తున్నాయి.
– ప్రణీత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ

కఠిన చర్యలు తప్పవు

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. రెవెన్యూ, పోలీసులను సమన్వయం చేసుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కేసులు కూడా పెడుతున్నాం. ఆకస్మిక తనిఖీలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.
– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

'సూపర్ సేవింగ్స్'తో ప్రజలకు మేలు

- కలెక్టర్ శ్యాంప్రసాద్

గోరంట్ల: 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ స్లాబులు తగ్గించడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. నిత్యం వినియోగించే టూత్ పేస్టు నుంచి ఏసీ వరకు, అదేవిధంగా రైతులు వినియోగించే సాగు పరికరాల నుంచి ట్రాక్టర్ వరకు అన్ని వస్తువుల ధరలూ తగ్గుతాయన్నారు. గురువారం గోరంట్ల సామాజిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ శ్యాం ప్రసాద్‌తో పాటు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ... 'సూపర్ సేవింగ్స్'పై నెల రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో ధర చూడాలన్నారు. ఎక్కడైనా పాత ధరలు ఉంటే వ్యాపారులను ప్రశ్నించాలన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ...సవరించిన జీఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ శ్యాంప్రసాద్ మంత్రి సవితతో కలిసి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ డీపీఓ సమతతో కలిసి చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



అంతర్జాతీయ బాలిక దినోత్సవం ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్యాంప్రసాద్, మంత్రి సవిత తదితరులు

పట్టణంలో ర్యాలీ..

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో చేపట్టిన అంతర్జాతీయ బాలిక దినోత్సవంలో కలెక్టర్ శ్యాంప్రసాద్, మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సర్కిల్ మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, బాలిక విద్యకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఆడపిల్లలు అర్ధంతరంగా చదువు మానకుండా చూడాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

25 మండలాల్లో వర్షం

- మరో రెండు రోజులూ వర్షసూచన

పుట్టపర్తి అర్బన్: వాతావరణంలో ఏర్పడిన మార్పులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ 25 మండలాల పరిధిలో 751 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గోరంట్ల మండలంలో 118.2 మి.మీ, బత్తలపల్లి మండలంలో 84.8 మి.మీ, సోమందేపల్లి మండలంలో 64.8 మి.మీ, నల్లమాడ మండలంలో 61.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక అమరాపురం మండలంలో 48.8 మి.మీ, పెనుకొండ 44.6, కొత్తచెరువు 41.2, సీకేపల్లి 29.8, రామగిరి 26.4, హిందూపురం 25.4, పరిగి 25.2, బుక్కపట్నం 23.2, ఓడీచెరువు 21.4, పుట్టపర్తి 19.4, తాడిమర్రి 17.2, ముదిగుబ్బ 16.6, రొద్దం 15.8, ధర్మవరం 15.2, అమడగూరు 14.0, గుడిబండ 11.4, కనగానపల్లి 8.4, మడకశిర 8.2, అగళి 4.2, తలుపుల 3.2, రొళ్ల మండలంలో 2.4 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరో రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు దివ్యాంగులకు పునఃపరిశీలన పరీక్షలు

ప్రశాంతి నిలయం: వికలాంగుల కోటాలో పింఛన్ పొందుతున్న వారికి శుక్రవారం పునఃపరిశీలన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. గతంలో జరిగిన పునఃపరిశీలన పరీక్షల్లో 40 శాతం కంటే తక్కువ వికలత్వం ఉన్నట్లు నిర్ధారణ కాగా, రీ అసెస్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ తాజాగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మడకశిర, కదిరి, ధర్మవరం ఏరియా ఆస్పత్రుల్లో శారీరక వికలత్వ పరీక్షలు, హిందూపురం జిల్లా ఆస్పత్రిలో చూపు, వినికిడి, బుద్ధిమాంద్యం, మానసిక వికలత్వ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పునఃపరిశీలనకు జిల్లాలోని 5,207 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ నోటీసులు అందించామన్నారు. నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హాజరు కావాలని సూచించారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ శ్యాంప్రసాద్, జేసీ అభిషేక్ కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు, మందుల సరఫరా, ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యం, రోగనిర్ధారణ పరీక్షలు, నీటి కాలుష్యం, క్లోరినేషన్, గ్రామ/వార్డు సచివాలయాల సేవలు తదితర అంశాల్లో మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతన్న ధర్మాగ్రహం

రైతన్నలు కన్నెర్ర చేశారు. భుక్తినిచ్చే భూమిని లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. కూటమి సర్కార్ చేస్తున్న కుటిల యత్నాలను నిరసించారు. వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి హిందూపురంలో కవాతు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై దుమ్మెత్తిపోశారు. బలవంతపు భూసేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



బలవంతపు భూసేకరణ నిరసిస్తూ హిందూపురంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న టీఎన్ దీపిక తదితరులు

భూసేక'రణం'

- టీఎన్ దీపిక ఆధ్వర్యంలో హిందూపురంలో భారీ ర్యాలీ
- కదం తొక్కిన రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా మిన్నంటిన నినాదాలు
- రైతులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమన్న నేతలు
- సర్కారు చర్యలను అడ్డుకోని ఎమ్మెల్యే బాలకృష్ణపై మండిపాటు



రైతులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్ దీపిక తదితరులు

చిలమత్తూరు: కూటమి ప్రభుత్వం చేస్తున్న బలవంతపు భూసేకరణపై రైతులు పోరుబాట పట్టారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో వందలాది మంది రైతులు గురువారం హిందూపురంలో భారీ ర్యాలీ తీశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ప్రారంభమైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకూ చేరుకుంది. ర్యాలీలో రైతులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బలవంతంగా భూములు సేకరించవద్దని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

రైతుకు అండగా నిలుస్తాం..

బలవంతపు భూసేకరణను అడ్డుకుని రైతుకు అండగా నిలుస్తామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక స్పష్టం చేశారు. రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతుల భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తోందన్నారు. అసలు ప్రభుత్వం దేనికోసం భూసేకరణ చేస్తోందో కూడా చెప్పడం లేదన్నారు. పచ్చని పంటలు పండే రైతుల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోందని, ఇది నిజంగా దుర్మార్గమైన చర్య అన్నారు. ఇలాంటి అరాచక పరిపాలన దేశంలో ఎక్కడా ఉండదన్నారు. అమరావతిలో రాజధాని పేరుతో భూములు లాక్కున్న కూటమి ప్రభుత్వం... ఇప్పుడు రాయలసీమలో పరిశ్రమలంటూ ఏపీఐఐసీని అడ్డం పెట్టుకొని రైతుల భూములు లాక్కొనే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. పొలాలు కోల్పోతే తమ కుటుంబాలు వీధిన పడతాయని రైతులు గగ్గోలు పెడుతున్నా...ప్రభుత్వం వెనక్కు తగ్గడం లేదన్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ కనీసం నోరు విప్పడం లేదని, అలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండటం హిందూపురం వాసుల దౌర్భాగ్యమన్నారు. వెంటనే ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు శ్రీకారం చుడతామని ఆమె హెచ్చరించారు.

రైతుల రోడ్డుపడేస్తారా..?

రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు చంద్రబాబు బలవంతంగా భూసేకరణ చేస్తున్నాడని రైతు సంఘం సీనియర్ నేత వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. రైతుల కడుపుకొట్టి జేబులు నింపుకోవడమేనా సంపద సృష్టి అని ప్రశ్నించారు. వ్యవసాయం అంటే గిట్టని చంద్రబాబు రైతులకు ఇన్సూరెన్స్‌లు, ఇన్‌పుట్ సబ్సిడీలు ఎగ్గొట్టే క్రమంలో భాగంగా ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నాడన్నారు. ఇప్పటికైనా బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, సీనియర్ నేత వేణురెడ్డి, రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి అమానుల్లా, ఎంపీపీ రత్నమ్మ, చలివెందుల సర్పంచ్ ఉపేంద్రరెడ్డి, హిందూపురం రూరల్, చిలమత్తూరు, లేపాక్షి మండల కన్వీనర్లు రాము, రామకృష్ణారెడ్డి, సయ్యద్ నిస్సార్, ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, లేపాక్షి వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, బీసీ సెల్, ఎస్సీ సెల్, మహిళా విభాగం, యూత్ వింగ్ అధ్యక్షులు రామాంజనేయులు, సూర్య మోహన్, కవితారెడ్డి, మింటు మనోజ్, శబరీష్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫుల్లా, నరసింహులు, కౌన్సిలర్లు రామచంద్ర, మహేష్‌గౌడ్, రోషన్ అలీ, నాయకులు శ్రీరాములు, పార్టీ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోరంట్లలోని పార్థ ఆస్పత్రి సీజ్



పుట్టపర్తి అర్బన్: కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు గోరంట్లలోని ఆర్టీసీ బస్టాండు రోడ్డులో ఉన్న పార్థ ఆస్పత్రిని సీజ్ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం తెలిపారు. వివరాలను గురువారం ఆమె వెల్లడించారు. ఇటీవల పలు ఫిర్యాదులు అందడంతో తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో సంబంధిత డాక్టర్ అందుబాటులో లేకపోవడం, ఒక డాక్టరు పేరున దరఖాస్తు చేసుకుని అందులో చాలామంది స్పెషలిస్ట్ వైద్యుల పేర్లు బోర్డులో ఉంచడం గమనించామన్నారు. సదరు స్పెషలిస్టల విద్యా వివరాలు, అనుమతులు ఇవ్వాలని అడిగినా యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంభించిందన్నారు. దీంతో పార్థ ఆస్పత్రిని సీజ్ చేశామన్నారు.

ఖతర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం రూరల్: ఖతర్‌లోని దోహాలో హోం కేర్ నర్స్ ఉద్యోగాలకు ఉమ్మడి జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైన్ల మతాల్లోని అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 21 నుంచి 40 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలన్నారు. బీఎస్సీ జీఎన్ఎం, నర్సింగ్ పూర్తి చేసి, కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారానికి 98499 01138, 99499 10415, 91607 75077 లో సంప్రదించాలన్నారు.

పుట్టపర్తి కీర్తి.. విశ్వ ఖ్యాతి


ప్రశాంతినిలయం రైల్వే స్టేషన్

- బాబా శత జయంతికి ప్రపంచ వ్యాప్తంగా తరలిరానున్న భక్తులు
- 62 ఏళ్లలో అనూహ్య పరిణామాలు

పుట్టపర్తి అర్బన్: అది స్థానికుల పూర్వ జన్మ సుకృతమో.. లేక సత్యసాయి బాబా అవతార మహిమో తెలియదు కానీ.. ఓ పది ఇళ్లతో మొదలైన పుట్టపర్తి ప్రస్థానం నేడు ఖండాంతరాలకు వ్యాపించింది. ఒకప్పుడు కేవలం కర్ణాటకలోని బాగేపల్లి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సు కోసం గంటల తరబడి వేచి చూసిన జనానికి... నేడు గంటల వ్యవధిలోనే ప్రపంచాన్ని చుట్టి వచ్చే సదుపాయాలు సొంతమయ్యాయి. నాడు చిరుతలు, ఎలుగుబంట్లు సంచరిస్తూ స్థానికులను భయాందోళన గొలిపిన ప్రాంతం.. నేడు ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. బాబా శత జయంతికి ప్రపంచ వ్యాప్తంగా భక్తులు తరలిరానున్నారు.

నాటి గొల్లపల్లే.. నేటి పుట్టపర్తి..

కులాలు, వర్ణాల వారీగా కమ్మవారిపల్లి, బ్రాహ్మణపల్లి లా గొల్లలు అధికంగా ఉండే ఊరు గొల్లపల్లిగా అవతరించింది. గొల్లపల్లిలో అధిక శాతం యాదవులు నివసిస్తూ గోవులను పోషించేవారు. ఓ యజమానికి చెందిన ఆవు రోజూ మేతకు వెళ్లి వచ్చిన తర్వాత పాలు ఇవ్వకుండా మొరాయించ


సత్యసాయి విమానాశ్రయం

సాగింది. దీంతో ఆవు దినచర్యపై యజమాని కన్నేశాడు. ఆవు మధ్యాహ్న సమయంలో ఓ పుట్ట వద్దకెళ్లి స్వతహాగా పాలు ఇవ్వడం గమనించిన యజమాని ఆగ్రహానికి లోనై పుట్టను పెకలించి, అందులోని పామును పెద్ద బండరాయితో కొట్టి గాయపరిచాడు. ఆ సమయంలో పాము చనిపోతూ గొల్లపల్లి మొత్తం పుట్టల మయమవుతుందని శపించిందనే కథనం వాడుకలో ఉంది. దీంతో గొల్లపల్లి వాసులు ఆందోళనకు గురై పరిహారం కింద ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడే వేణుగోపాల స్వామి ఆలయాన్ని నిర్మించారు. అలా కాలానుగుణంగా గొల్లపల్లి కాస్త తొలుత పుట్టవర్తిగా.. ఆ తర్వాత పుట్టపర్తిగా ప్రసిద్ధికెక్కింది.

సమితి నుంచి జిల్లా కేంద్రం వరకూ..

పంచాయతీ కేంద్రంగా 1964లో రికార్డుల్లోకి పుట్టపర్తి ఎక్కింది. 1980 నవంబర్‌లో పుట్టపర్తిని సత్యసాయి తాలూకాగా ఆవిష్కరించారు. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలను కలుపుతూ సత్యసాయి తాలూకా ఏర్పాటైంది. ఆ సమయంలోనే తాలూకా చుట్టూ నాలుగు వైపులా ఆర్చీలు ఏర్పాటు చేశారు. అభివృద్ధిలో భాగంగా పంచాయతీని 1980లో సమితిగాను, 2006 ఆగస్టులో మేజర్ పంచాయతీగా, 2011 ఆగస్టులో పుట్టపర్తి నగర పంచాయతీగా, 1991లో పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ (పుడా)గా అనంతరం 2009లో అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రంగా రూపాంతరం చెందింది. 2022లో పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భవించింది.


సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి



సత్యసాయి రాకతో మారిన రూపురేఖలు..

చిత్రావతి నది ఒడ్డున వెలసిన గొల్లపల్లిలో 1926 నవంబర్ 23న పెద్ద వెంకమరాజు, ఈశ్వరమ్మ దంపతులకు జన్మించిన బాలుడికి సత్యనారాయణగా నామకరణం చేసిన తల్లిదండ్రులు ఎంతో అల్లారుముద్దుగా పెంచుకునేవారు. 1940 అక్టోబర్‌లో ఆ బాలుడు తన అవతార ప్రకటన అనంతరం సత్యసాయిగా మారి ఎన్నో అద్భుతాలు చూపారు. 1948లో ప్రశాంతినిలయానికి శంకుస్థాపన చేసిన సత్యసాయిబాబా 1950 నవంబర్ 23 తేదీ నాటికి నిర్మించి ప్రారంభించారు. అక్కడే పూర్ణచంద్ర ఆడిటోరియం నిర్మించి ఆధ్యాత్మిక కార్యకలాపాలు నిర్వహించేవారు. విద్యతోనే మానవ జీవనం సుఖమయమవుతుందని 1981 నవంబర్‌లో అప్పటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ చేతుల మీదుగా సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీని ప్రారంభించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేస్తూ 1984 ఫిబ్రవరిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని చేపట్టి 1991లో అన్ని రకాల వైద్య సేవలతో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక మారుతున్న కాలానుగుణంగా 1990లో ఆర్టీసీ బస్‌స్టేషన్, 1991 నవంబర్‌లో సత్యసాయి విమానాశ్రయాన్ని నిర్మించారు. 2000 నవంబర్‌లో ప్రశాంతినిలయం రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల ప్రజల దాహార్తిని తీర్చే బృహత్ కార్యక్రమాన్ని 1995 జూలైలో ప్రారంభించి అప్పట్లో 771 గ్రామాలకు మంచినీటిని సరఫరా చేశారు. భక్తుల కోసం నిర్మించిన సాయికుల్వంత్ సభామంటపాన్ని 1995 జూలైలో ప్రారంభించారు. ప్రేమ, శాంతి ధర్మం, సమత, మమత, సేవా తత్పరతకు అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి విరాజిల్లుతోంది.

రీ సర్వే పనుల్లో అలసత్వాన్ని సహించం

- జేసీ అభిషేక్ కుమార్ హెచ్చరిక


రీ సర్వేపై సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: రీ సర్వే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని, సంబంధిత అధికారులపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాలులో సర్వే శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రీసర్వే అంశాలపై సమీక్షించారు. ఫేజ్–2 రీసర్వే, ఎఫ్‌పీఓఎల్ఆర్ పనులను గడువులోపు పూర్తి చేయాలని, ఫేజ్–3 రీసర్వేకు సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాల మేరకు కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. రీ సర్వేలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా సంబంధిత అధికారులు పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, లాండ్, సర్వే అధికారిని విజయశాంతి బాయి, సర్వే శాఖ డీఐఓలు, డీఐఓలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

కదిరి అర్బన్: తమకు తాగునీరు అందించాలంటూ కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలోని హమాలీ కాలనీకి చెందిన పలువురు మహిళలు గురువారం స్థానిక సచివాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమానికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. స్పందించిన అధికారులు కాలనీకి రెండు నీటి ట్యాంకర్లను పంపి.. శుక్రవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాంబశివ, నారాయణ, దివాకర్‌నాయక్, కాంతమ్మ, భారతి, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

రాప్తాడు: టిప్పర్ కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని రుద్రంపేటలో నివాసముంటున్న చిట్రా వరప్రసాద్ (41), బంగారు నాగరత్న దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శారీ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో చిట్రా వరప్రసాద్ గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై రాప్తాడు మండలం హంపాపురంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడా పని ముగించుకుని రుద్రంపేటకు తిరుగు ప్రయాణమైన ఆయన హంపాపురం క్రాస్‌లో 44వ జాతీయ రహదారిని దాటుతుండగా అనంతపురం వైపుగా వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో చిట్రా వరప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యాడికిలో వరుస చోరీలు

యాడికి: మండల కేంద్రంలోని ఐదు ఇళ్లలో వరుస చోరీలు చోటు చేసుకున్నాయి. బుధవారం రాత్రి ఇద్దరు దుండగులు నెత్తికి రుమాలు చుట్టుకుని తాళం వేసిన గృహాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. కమ్మవీధిలోని వడ్డి కృష్ణమూర్తి ఇంట్లో 50 తులాల వెండి, తమ్మినేటి రాజగోపాల్ నాయుడు ఇంట్లో రూ.4వేల నగదు, వెండి దీపాలు, కలశం, శాంతి నగర్‌లోని ఓబయ్య కుమారుడు పోతురాజు రాజయ్య ఇంట్లో రూ.37వేల నగదు, ఒక తులం బంగారు చైను, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, సుమయాన్ ఇంట్లో రూ.10వేల నగదు, 2 తులాల బంగారం, కోన రోడ్డులోని కోటేష్ కుమారుడు గంగవరం శివ ఇంట్లో వెండి కాళ్ల పట్టీలు, వెండి మొలతాడును అపహరించారు. గురువారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు చోరీ జరిగిన 5 ఇళ్లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు.

సచివాలయ ఉద్యోగి చేతివాటం!

నల్లచెరువు: మండల కేంద్రంలోని సచివాలయం–2లో గతంలో విధులు నిర్వర్తించిన ఓ ఉద్యోగి పింఛన్ సొమ్ము పంపిణీలో చేతివాటం ప్రదర్శించాడు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఓ వితంతు మహిళకు రెండేళ్ల క్రితం పింఛన్ మంజూరైంది. అప్పట్లో మూడు నెలలు క్రమం తప్పకుండా ఆమె పింఛన్ తీసుకున్నారు. ఆ తర్వాత బతుకు తెరువు కోసం సౌదీకి వెళ్లిపోయారు. కొన్నిరోజుల క్రితం తిరిగి వచ్చిన ఆమె రెండు రోజుల క్రితం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి తన పింఛన్‌పై ఆరా తీసింది. అయితే రెండేళ్లుగా ప్రతి నెలా ఆమె పింఛన్ తీసుకుంటున్నట్లుగా రికార్డు ఉందని అధికారులు తెలిపారు. అయితే తాను సౌదీలో ఉండగా తన పింఛన్ ఎవరు తీసుకుంటారని ఆమె ప్రశ్నించడంతో అధికారులు రికార్డులన్నీ పరిశీలించారు. పింఛన్ పంపిణీ చేసే సచివాలయ ఉద్యోగి తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్బీస్ యాప్ ద్వారా తన అథెంటికేషన్ అప్‌డేట్ చేసి రెండేళ్లుగా పింఛన్ సొమ్ము కాజేసినట్లుగా నిర్ధారించారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా గార్లదిన్నెకు వెళ్లినా... ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సదరు మహిళ పింఛన్ ఐడీని కూడా తాను బదిలీ అయిన చోటుకు మార్పు చేసుకుని పింఛన్ సొమ్ము కాజేస్తున్నట్లుగా గుర్తించారు. అయితే ఈ విషయంలో జోక్యం చేసుకున్న టీడీపీ నాయకులు.. సదరు ఉద్యోగితో మాట్లాడి స్వాహా చేసిన సొమ్మును ఇప్పించినట్లు సమాచారం. ఈ విషయంపై ఎంపీడీఓ రామకృష్ణను వివరణ కోరగా.. బాధితురాలు ఫిర్యాదు మేరకు సచివాలయ ఉద్యోగిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

స్వాహా చేసిన పింఛన్ సొమ్ము చెల్లింపు

చెన్నేకొత్తపల్లి: పింఛన్‌దారులకు పంపిణీ చేయాల్సిన రూ.39 వేలు తీసుకుని ఉడాయించిన న్యామద్దెల సచివాలయం–1 సర్వేయర్ హేమంత్‌కుమార్ గురువారం ఆ సొమ్మును ఎంపీడీఓ బాలకృష్ణకు అప్పగించారు. ఈనెల 1వ తేదీన పింఛన్ డబ్బుతో ఉడాయించిన హేమంత్ కుమార్.. చివరకు ఫోన్‌లో కూడా వారం రోజులుగా అందుబాటులోకి రాలేదు. దీంతో ఎంపీడీఓ బాలకృష్ణుడు బుధవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే హేమంత్‌కుమార్ సంజాయిషీ కూడా ఇవ్వకపోవడంతో తదుపరి చర్యలకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సర్వేయర్ హేమంత్‌కుమార్ గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. పింఛన్ సొమ్ము రూ.39 వేలు చెల్లించారు. దీంతో మరోసారి ఇలా చేయవద్దని ఎంపీడీఓ మందలించి పంపారు.

మామిడి మొక్కల నరికివేత

ధర్మవరం రూరల్: మండలంలోని ముచ్చురామి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామ్మోహన్‌రెడ్డికి చెందిన 30 మామిడి మొక్కలను గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. బాధితుడు తెలిపిన మేరకు... తనకున్న పొలంలో 150 మామిడి మొక్కలను సాగు చేశానన్నారు. రెండేళ్ల వయసున్న 30 మొక్కలను నరికి వేశారన్నారు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.


మా సొమ్ము చెల్లించండి మహాప్రభో!

- తూముకుంట ఎస్‌బీఐ ఎదుట ఖాతాదారుల ఆందోళన


తూముకుంట ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

హిందూపురం:. భవిష్యత్తు అవసరాల కోసం బ్యాంకులో దాచిన సొమ్ము అత్యవసరానికి చేతికి అందడం లేదని, తమ సొమ్ము తమకు అందజేయాలంటూ తూముకుంట ఎస్‌బీఐ ఎదుట ఆ బ్యాంక్ ఖాతాదారులు గురువారం ఆందోళన చేపట్టారు. హిందూపురం మండలం తూముకుంట పారిశ్రామిక వాడలోని ఎస్‌బీఐలో మూడు నెలల క్రితం భారీ దోపిడీ జరిగిన విషయం తెలిసిందే. దీనిపై ఖాతాదారులకు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, పొదుపు చేసిన సొమ్ము, డిపాజిట్లను చెల్లిస్తామంటూ అప్పట్లో బ్యాంకు అధికారులు భరోసా ఇచ్చారు. ఖాతాదారులకు అవసరమైన సొమ్మును 15 రోజుల్లోపు చెల్లిస్తామని పేర్కొన్నారు. నెల రోజుల క్రితం అగ్రిమెంట్లు రాయించుకుని కూడా నేటికీ సొమ్ము చెల్లించకపోవడంతో తూముకుంట కార్మిక సంఘం నాయకుడు రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం బ్యాంక్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బంగారు విలువ పెరుగుతూ ఉందని, తాము బ్యాంకులో దాచిన బంగారానికి ఎప్పటిదో పాత రేటు ఇస్తే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. బ్యాంకు వెళ్లిన ఖాతాదారుల పట్ల సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బిడ్డల పెళ్లి కోసం దాచుకున్న డబ్బు ఇవ్వకపోతే పెళ్లి ఆగిపోయే పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎస్‌బీఐ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేకూర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ


కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు

పుట్టపర్తి అర్బన్: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపులో భాగంగా శనివారం నుంచి జిల్లాలో టీచర్లు బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ శ్యాంప్రసాద్, డీఈఓ కార్యాలయ ఏడీలు శ్రీనివాసులు, వినయ్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కేవలం ఉపాధ్యాయుల హాజరు, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం పనులు, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, బోధన వంటి పనులు మాత్రమే చేస్తారని తక్కిన బోధనేతర పనుల జోలికి వెళ్లరని స్పష్టం చేశారు. కలెక్టర్‌ను కలసిన వారిలో ఫ్యాప్టో చైర్మన్ గజ్జల హరిప్రసాదెడ్డి, జనరల్ సెక్రెటరీ గౌస్‌లాజం, కార్యవర్గ సభ్యులు చంద్ర, సుధాకర్, హరిప్రసాదరెడ్డి, షమీవుల్లా, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి సురేంద్ర, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

‘సరిహద్దు’ను చక్కదిద్దుతాం

- అంతర్ రాష్ట్ర సరిహద్దులో నేరాలను నియంత్రిస్తాం
- నిరంతరం సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు
- పోలీసులు తప్పు చేస్తే సస్పెన్షన్ వేటు తప్పదు
- ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడి


రొళ్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్

మడకశిర/అమరాపురం/రొళ్ల/గుడిబండ/అగళి/: ‘‘రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోనే నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మట్కా, ఇతర గ్యాంబ్లింగ్ కూడా ఆయా ప్రాంతాల్లోనే ఎక్కువగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అందువల్ల సరిహద్దును చక్కదిద్ది నేరాలు పూర్తిగా నియంత్రించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం’’ అని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మడకశిర అప్ గ్రేడ్, రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్లతో పాటు అమరాపురం, రొళ్ల, గుడిబండ, అగళి పోలీసు స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా స్టేషన్‌లలో రికార్డులు, లాకప్ గదులు, కమాండ్ కంట్రోల్‌రూం, మహిళా హెల్ప్ డెస్క్, స్టేషన్ల పరిసరాలు, పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల కేసుల గురించి తెలుసుకున్నారు. వివిధ కేసుల్లో దర్యాప్తు గురించి పోలీసులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. జాతీయ రహదారులపై లారీలు, ఇతర వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్ 100 వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దుల గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బంది సూచించారు. మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అపరిచితుల వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అనుమానం ఉన్న ప్రదేశాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు అమర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నో మట్కా.. నో గ్యాంబ్లింగ్

జిల్లాలో మట్కా, గ్యాంబ్లింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయా స్టేషన్ల తనిఖీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కదిరి, హిందూపురం పోలీస్ సర్కిల్ పరిధిలో గంజాయి కార్యకలాపాల నియంత్రణకు పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఒరిస్సా నుంచి హిందూపురం, కదిరి ప్రాంతాలకు గంజాయి కొంతమేర సరఫరా అవుతున్నట్లు సమాచారం ఉందన్నారు. దీన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు గంజాయి విక్రేతలు, రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉన్న మడకశిర నియోజకవర్గంలో ఎలాంటి నేరాలకు అవకాశం ఉంది... క్షేత్రస్థాయిలో వాటికి గల కారణాలను విశ్లేషించి, ఆయా నేరాలను అరికట్టడానికి పక్కా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. సరిహద్దులోని కీలక ప్రాంతాల్లో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానిస్తామన్నారు. దీనివల్ల నేరస్తులను గుర్తించడం సులభతరమవుతుందన్నారు. ఇక జిల్లాలో అధిక వడ్డీ వ్యాపారం చేసే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేరస్తులతో చేతులు కలిపితే వేటు తప్పదు..

జిల్లాలో ఒకే స్టేషన్‌లో పాతుకుపోయిన హోంగార్డులందరినీ ఇప్పటికే బదిలీ చేశామని, త్వరలో ఆయా ప్రాంతాలకు కొత్త హోంగార్డులను పంపుతామన్నారు. ఇక నేరస్తులతో చేతులు కలిపే పోలీసు అధికారులు, సిబ్బందిని కూడా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. వాహనాలు, ఇతరత్రా సమస్యలు ఉన్నప్పటికీ నేర రహిత జిల్లాగా మార్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. గంజాయి, మట్కా, పేకాట, అక్రమ మద్యం, నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎస్పీ వెంట పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప, సీఐలు నగేష్ బాబు, రాజ్‌కుమార్, ఎస్ఐ వీరేష్, ఏఎస్ఐలు శ్రీరాములు, బషీర, ఇదాయతుల్లా, పోలీసు సిబ్బంది ఉన్నారు.